www.prajasakti.com
# ప్రజాశక్తి
శుక్రవారం 8 ఆగస్టు 2025
5
తూర్పుగోదావరి



## మండల కేంద్రానికి ఫార్మెటివ్-1 పరీక్షల ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 11వ తేదీ నుంచి జరగనున్న ఫార్మెటివ్-1 పరీక్షల ప్రశ్న పత్రాలు మండల కేంద్రానికి వచ్చాయని అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్‌లో ప్రశ్న పత్రాలను భద్రపరిచినట్లు డిఐ తెలిపారు. సోమవారం నుంచి పరీక్షకు ఒక గంట ముందు ప్రశ్న పత్రాలను ప్రధానోపాధ్యాయులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంఇఒ- 2 రమా రజని, ప్రధానోపాధ్యాయులు సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

# పర్మిట్ రూమ్‌లకు పచ్చ జెండా

- ఇక మరింత ఏరులై పారనున్న మద్యం
- ఇప్పటికే జోరుగా 'బెల్ట్' విక్రయాలు
- జాతీయ ఎక్సైజ్ విధానానికి విరుద్ధంగా నిర్ణయం
- వచ్చే నెల నుంచే కొత్త బార్లకు, అనుమతి గడులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మద్యాన్ని ఏరులై పారించేందుకు కూటమి ప్రభుత్వం మరింత ముందుకు సాగుతోంది. ఇప్పటికే ఊరు వాడ విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయి. దీంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా, అక్కడ, ఇక్కడ అని కాకుండా ఎల్లవేళలా అందుబాటులో మద్యం దొరుకుతుంది. దీంతో అనేకమంది యువత పెడదోవ పడుతున్నారు. తాజాగా మద్యం షాపుల చెంతనే పర్మిట్ రూములకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల ఒకటి నుంచే ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఆ రోజు నుంచే కొత్త బార్లకు అనుమతితో పాటు, మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూములను ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. పర్మిట్ రూములకు కూటమి సర్కారు 'పచ్చ' జెండా ఊపడంతో మద్యం షాపుల యజమానులు ఇక తమ జేబులను నింపుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. అయితే జాతీయ ఎక్సైజ్ విధానానికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవడంపై చంద్రబాబు ప్రభుత్వంపై పలు విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

కాకినాడ జిల్లాలో 155 ప్రైయివేటు మద్యం దుకాణాలు, 20 బార్లు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 169 షాపులు, 10 బార్లు, తూర్పు గోదావరి జిల్లాలో 154 దుకాణాలు, 19 బార్లు ఉన్నాయి. అలాగే మండలానికి ఒకటి చొప్పున బిసి కులాలకు ప్రత్యేకంగా కేటాయించిన షాపులు అందుబాటులోకి వచ్చాయి. ఇలా పలుచోట్ల గతం కంటే లైసెన్స్ మద్యం షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. గత వైసిపి సర్కారు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం షాపులను నడిపింది. అయితే నాసిరకం బ్రాండ్లను విక్రయాలు జరిపి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడిందనే తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు నాసిరకం బ్రాండ్లను ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా విక్రయించుకుని వందల కోట్లు ప్రజల సొమ్మును లూటీ చేశారని ఆరోపణలను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు చంద్రబాబు నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తామంటూ ప్రజలకు హామీ ఇచ్చారు. మద్యపాన నిషేధాన్ని పక్కనపెట్టి ప్రైయివేటు వ్యక్తులు విక్రయాలు జరుపుకునేలా అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో లైసెన్సులు పొందిన వారిలో 80 శాతానికి పైగా కూటమి పార్టీలకు చెందిన నేతలే ఉండడం గమనార్హం.

### ఆదాయమే పరమావధిగా...

ప్రభుత్వం మద్యం అమ్మకాల ద్వారా భారీగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుంది. దీనిలో భాగంగానే లైసెన్సులు పొందేందుకు లాటరీ పద్ధతిని నిర్వహించింది. లాటరీలో పాల్గొనేవారు ఒక్కొక్కరు రూ.2 లక్షలు చెల్లించాలని నిబంధన విధించింది. ఈ ప్రక్రియలో తొలి దశలోనే ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. మరోవైపు ఒక్కో లైసెన్స్ దుకాణానికి ఏడాదికి రూ. 65 లక్షలు కిస్తీ సొమ్ములను వసూలు చేస్తోంది. ఏడాది మొత్తంలో ఈ సొమ్ము చెల్లించాల్సి ఉండగా ఏడు నెలల వ్యవధిలోనే ప్రభుత్వం లైసెన్స్ మద్యం యజమానుల నుంచి కిస్తీ సొమ్మును రాబట్టుకుంది. ప్రస్తుతం పర్మిట్ రూములకు ఒక్కొక్క షాపు నుంచి రూ.5 లక్షలు వసూలు చేయనుంది. షాపు పక్కనే మద్యం తాగేందుకు గదిని ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తారు. అక్కడ కుర్చీలు, బల్లలు వేసుకుని తాగేందుకు అవకాశమిస్తారు. షాపు లైసెన్సీకి వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు, స్నాక్స్ లాంటివి విక్రయించుకోవడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. పర్మిట్ రూమ్‌ల వల్ల మద్యం విక్రయాలు మరింత పెరుగుతాయి. దీంతో ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరడంతో బాటు వ్యాపారుల జేబులు నింపుకోవచ్చు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల కొలది బెల్ట్ షాపుల్లో విక్రయాలు యదేచ్ఛగా సాగుతున్నాయి.

చిన్న చిన్న గ్రామాల్లో సైతం 5 నుంచి 8 వరకూ బెల్ట్ దుకాణాలు నడుస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే ప్రతీ 10 బడ్డీ దుకాణాల్లో 6 షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. మరోవైపు లైసెన్సు దుకాణదారులు సైతం సిండికేట్లుగా ఏర్పడి అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో బాటిల్ పై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. అలాగే పర్మిట్ రూములకు అనుమతులు లేకపోయినప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారుల అండదండలతో ఇప్పటికే లైసెన్స్ దుకాణదారులు పర్మిట్ రూములు మాదిరిగానే మద్యం దుకాణాల వద్ద విచ్చలవిడిగా మందుబాబులు కూర్చుని తాగి ఊగేందుకు అవకాశం కల్పిస్తున్నారు. మామూళ్లను సమర్పించుకుంటున్న వ్యాపారులు తమ పని కానిచ్చేసు _న్నారనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. మరోవైపు సమయపాలన కూడా పాటించడం లేదనే ఫిర్యాదులు తరచూ అధికారులకు వెళు తున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం విచ్చలవిడి అమ్మకాలను నియంత్రించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# గిరిజన సంస్కృతిని రక్షించుకుందాం

## అంతర్జాతీయ గిరిజన దినోత్సవంలో విసి ప్రసన్నశ్రీ

జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న విసి తదితరులు

ప్రజాశక్తి - రాజానగరం

మౌఖిక రూపంలో ఉండే అపారమైన గిరిజన సాహిత్య సంస్కృతి సంపదను సాంకేతిక పరిజ్ఞానంతో పరిరక్షించి భావితరాలకు అందించాలని విసి ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సహకారంతో ఎస్‌సి, ఎస్‌టి సెల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ట్రైబల్ డేను గురువారం నిర్వహించారు. యూనివర్సిటీ సెమినార్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విసి ఎస్.ప్రసన్నశ్రీ, విశిష్ట అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, కన్వీనర్‌గా సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయనిర్మల హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గిరిజన సంస్కృతిని ప్రతిబింబిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులతో కలిసి యూనివర్సిటీ అధికారులు నృత్య ప్రదర్శన చేసి అలరించారు.

ఈ సందర్భంగా విసి మాట్లాడారు. ప్రకృతి ఒడిలో పర్యావరణహితంగా జీవించే గిరిపుత్రులకు అంతర్జాతీయ ఆదివాసి గిరిజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. "స్థానిక ప్రజలు మరియు కత్రిమ మేధస్సు - హక్కులను కాపాడుకోవడం, భవిష్యత్తును రూపొందించడం" అనే థీమ్ తో ప్రపంచ గిరిజన దినోత్సవం జరుగుతుందన్నారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని భాష, సాహిత్యం, సంస్కృతి ఎంతో ప్రత్యేకమైనవన్నారు. 35 ఏళ్ల గిరిజన ప్రాంతంలోని తన అనుభవాలను ఈ సందర్భంగా పంచుకున్నారు. 19 గిరిజన భాషలకు లిపి రూపొందించడంతో పాటు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలపై అవగాహన కలిగి ఉండడం ఆనందంగా ఉందన్నారు. చిన్న చిన్న గూడేల్లో స్వచ్ఛమైన గిరిజన సాహిత్యం తారసపడుతుందన్నారు. గిరిజనులు వాడుక భాషలో మౌఖికంగా సాహిత్య సేద్యం చేస్తున్నారని అని చెప్పారు. ప్రకృతితో బంధం ఏర్పరచుకుని, రాయిలో కూడా దేవుని చూడగలిగే మంచి మనసున్న వారు గిరిపుత్రులు అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో రహదారులు వేయడం అభినందనీయమన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం పూర్తిగా అందుబాటులో ఉండాలన్నారు. ఐక్య రాజ్య సమితి ప్రకారం, అంతరించిపోతున్న భాషలు, మౌఖిక చరిత్రలను సంరక్షించడానికి, పూర్వీకుల భూములను మ్యాప్ చేయడానికి మరియు వాతావరణ మార్పులను పరిష్కరించడానికి స్థానిక జ్ఞానాన్ని విస్తతం చేయడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్ర గిరిజన వర్గాలు భావితరాలకు సజీవ వారసత్వ సంపద అన్నారు. ఆంధ్రప్రదేశ్ కొండ రెడ్డిలు, కోయలు, సవరలు, గదబలు, చెంచులు వంటి శక్తివంతమైన గిరిజన సమాజాల ఉనికితో జీవిస్తున్నారని తెలిపారు. ఈ సమాజాలు కేవలం ప్రజల సమూహాలు మాత్రమే కాదని, అవి పురాతన జ్ఞానం యొక్క సజీవ గ్రంథాలయాలన్నారు. మూలికా వైద్యం, స్థిరమైన వ్యవసాయం మరియు పర్యావరణ పరిరక్షణలో వారి నైపుణ్యం వాతావరణ మార్పు మరియు జీవవైవిధ్య నష్టం వంటి ఆధునిక సవాళ్లకు పరిష్కారాలను అందిస్తుందన్నారు. గిరిజన కళారూపాలు ధింసా నత్యం, గోండ్ చిత్రాలు మరియు గిరిజన సంగీతం - కేవలం ప్రదర్శనలు కాదు, ప్రకతి మరియు చరిత్రతో వారి లోతైన సంబంధాన్ని వివరించే కథనాలు చాలా ఉన్నాయన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి మాట్లాడుతూ నేటి ఆధునిక మానవుల ఆదిమ జీవితం ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లోనే ఆరంభమైందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని వివిధ రకాల సంస్కృతి సంప్రదాయాలను గురించి ప్రస్తావించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజన వీరుల కృషి చిరస్మరణీయమన్నారు. కన్వీనర్ డాక్టర్ పి.విజయనిర్మల మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రతి ఏడాదీ ఐక్యరాజ్యసమితి సూచించిన థీమ్ ప్రకారం అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -కొవ్వూరు

కొవ్వూరు పట్టణంలో విద్యుత్ సబ్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మత్తులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఇఇ నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. గౌతమి నగర్ ఫ్యాక్టరీ రోడ్డు, అవంతి ఫ్యాక్టరీ ఏరియా, శ్రీనివాసపురం, గోదావరి బండ్ ఏరియా, క్రిస్టియన్ పేట, శ్రీ రామ కాలనీ లకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

## పీజీ కోటాపై ప్రభుత్వ నిర్ణయం అభ్యంతరకరం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ డాక్టర్లకు ఉన్న పీజీ కోటాను 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వేలివెన్ను పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాపై ఏ నిర్ణయం అయినా ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ల అసోసియేషన్ సంఘం ప్రతినిధులతో సంప్రదింపులు జరిపిన తరువాతే తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే ఉన్నతాధికారులు ఎలాంటి సమాచారం లేకుండా మీడియా ద్వారా కోటాను 15 శాతానికి తగ్గించినట్లు ప్రకటించడం దారుణమన్నారు. ఈ నిర్ణయం గిరిజన ప్రాంతాలు, గ్రామాల్లో పనిచేస్తున్న వైద్యులను నిరుత్సాహానికి గురి చేస్తుందన్నారు.

## కార్టూ'నిజం'




# మార్కెట్ యార్డులో డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం

డిజిటల్ పేమెంట్ చేస్తున్న మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - పెరవలి

మార్కెట్ యార్డుల్లో డిజిటల్ వసూళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టుల వద్ద డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టారు. నగదు వసూళ్లకు బదులుగా ఇకపై ఈ-పాస్ యంత్రాల ద్వారా డిజిటల్ రసీదులు ఇవ్వనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా తూర్పుగోదావరి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పెరవలి చెక్ పోస్ట్ వద్ద డిజిటల్ విధానాన్ని మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు. ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిన కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా అధికార యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. ప్రభుత్వం తెచ్చిన ఈ విధానంతో మార్కెట్ యార్డుల ఆదాయానికి గండి పడకుండా రుసుం లక్ష్యాలను వంద శాతం చేరుకునేందుకు వీలుంటుందని కలెక్టర్ తెలిపారు. ఎస్‌బిఐ సహకారంతో దీన్ని అమలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ యార్డు తనిఖీల్లో ఈ విధానం అమల్లోకి వస్తుంది మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ విధానం వల్ల అవినీతికి తావుండదన్నారు. మార్కెట్ కమిటీల ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి రంగంలో యాప్‌ల ద్వారా ప్రజలకు సౌలభ్యంతో కూడిన డిజిటల్ విధానాన్ని ప్రవేశపెడుతోందన్నారు. తద్వారా డేటా సేకరణ సులువవుతుందన్నారు. రైతు సంక్షేమానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి డిజిటల్ మార్గాలు అందుబాటులోకి రావడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన ఈ విధానంతో మార్కెట్ యార్డుల ఆదాయానికి గండి పడకుండా రుసుం లక్ష్యాలను నూరుశాతం చేరుకునే వీలుంటుందన్నారు. నకిలీ రసీదులతో చేతివాటం ప్రదర్శిస్తున్న వారికి చెక్ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగోలు సీతమ్మ , మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్, పాపారావు, అసిస్టెంట్ డైరెక్టర్ సునీల్, నిడదవోలు, తణుకు మార్కెటింగ్ సెక్రెటరీలు హరిబాబు వడలి ప్రసాద్, ఎంపిపి కె.సీతారాంప్రసాద్ డిసిఎంఎస్ మాజీ చైర్మన్ రవి వర్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపిఒకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధి కూలీలు

## వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

ఉపాధి హామీ పథకం కార్మికులకు వేతన బకాయిలు తక్షణమే మంజూరు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కరించాలంటూ గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. పథకానికి బడ్జెట్లో నిధులు తగ్గించడం దారుణమన్నారు. ఫోటోలు పేరుతో కార్మికులను వేధించటం తగదన్నారు. దాదాపు మూడు నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. వేతనాలు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచాలన్నారు. మస్టర్ స్లిప్‌లను ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదాలు బారిన పడిన కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపిఒ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు, ఉపాధి హామీ కార్మికులు కొడమంచిలి చిరంజీవి, అడపా సూర్యారావు, పి.సత్తిరాజు, టి.కృష్ణ, చీకటి వెంకాయమ్మ, కె.శ్రీను, కె.దుర్గ, టి.రాణి తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి

చాగల్లులో ఠాగూర్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో చంద్రవరం శాఖా గ్రంథాలయంలో గురువారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 84వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపియుపి పాఠశాల హెచ్‌ఎం జివిఎస్‌ఆర్.మూర్తి, గ్రంథ పాలకుడు కె.సుమన్‌కుమార్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి ఆసియా వాసి రవీంద్రనాథ్ అని స్కూల్ అసిస్టెంట్ సోషల్ టీచర్ వేములపల్లి వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు కె.సుమన్‌కుమార్, పాఠకులు పాల్గొన్నారు.

**తాళ్లపూడి :** దేశానికి జాతీయ గీతం అందించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పైడిమెట్ట ఎంపిబిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు అన్నారు. ఠాగూర్ వర్ధంతి సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో విశ్వకవి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు ఠాగూర్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయుడు ధర్మాన రాము, మధ్యాహ్న భోజనం పథకం కార్మికురాలు రామలక్ష్మి, ఎపిఎం విజయ, మానవతా మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**పెరవలి :** మండలం ముక్కామల శాఖా గ్రంథాలయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 84వ వర్ధంతిని నిర్వహించారు. పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.వెంకటేశ్వర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

అశోక్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి

# రోడ్డు విస్తరణ పనుల్లో ఎంఎల్ఎ తీరుపై నిరసన

నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - సీతానగరం

రోడ్డు విస్తరణ పనుల విషయంలో ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ తీరును నిరసిస్తూ వైసిపి నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ గంటా శీను, సీతానగరం సర్పంచ్ కొండ్రపు ముత్యాలు, నాయకులు పెద్దిపాటి రమేష్ బాబు తదితరులు మాట్లాడారు. బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకు గల రహదారిని 66 అడుగుల వెడల్పుతో నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, రఘుదేవపురం హర్షవర్ధన స్కూల్ వరకు 66 అడుగుల మేరకు వైసిపి పనులు చేసిందన్నారు. అక్కడ నుంచి సీతానగరం వరకూ కూటమి ప్రభుత్వం కేవలం 30 అడుగుల రోడ్డును మాత్రమే నిర్మిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పక్కన పెట్టి, రోడ్డు విస్తరణ లేకుండా పనులు చేయడం వెనుక అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ పనుల వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించకపోతే నిరసనను మరింత ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని, ప్రజలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ ధర్నాలో ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, పెందుర్తి దేవదాసు, రంధి భారతి దేవి తదితరులు పాల్గొన్నారు.

### నిరసనకారులపై కేసు నమోదు

రహదారి నిర్మాణం కుదింపుపై వైసిపి చేపట్టిన నిరసన కార్యక్రమంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి అనుమతులు లేవని స్థానిక పోలీసులు ముందుగానే తెలియజేసినప్పటికీ, నిరసనకారులు పోలీసుల ఉత్తర్వులను ఉల్లంఘించి కార్యక్రమం నిర్వహించారని ఎస్ఐ రాంకుమార్ తెలిపారు. ఈ ఆందోళన కారణంగా ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కేసు నమోదు చేసినట్లు వివరించారు. నిరసనకారులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## జిజిహెచ్ అన్న క్యాంటీన్‌లో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్దనున్న అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశాలను పరిశీలించారు. ఆహారం స్వీకరిస్తున్న ప్రజలతో మాట్లాడారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత, వసతుల లభ్యత, సమయ పాలన, టోకెన్ల అందుబాటు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ నిర్వహణ విషయంలో ప్రజల నుంచి అభిప్రాయాలు కూడా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా సేకరించవచ్చని ఆమె తెలిపారు. అన్న క్యాంటీన్ల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండరాదన్నారు. సమయ పాలన కచ్చితంగా పాటించాలన్నారు. ప్రజల నుంచి ఆహారం అందకపోయినట్లు ఫిర్యాదులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అక్షయపాత్ర సంస్థ సిబ్బందికి సూచించారు. క్యాంటీన్ల నిర్వహణ నోడల్ అధికారులదే పూర్తి బాధ్యతని స్పష్టం చేశారు.

అన్నాక్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

## అశోక్‌కుమార్‌కు ఎంఎల్ఎ ముప్పిడి పరామర్శ

ప్రజాశక్తి - గోపాలపురం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి అశోక్‌కుమార్‌ను కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం పరామర్శించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ గతంలో గోపాలపురం ఎంఎల్ఎ పనిచేసిన సమయంలో అశోక్ కుమార్ పార్టీలో ఎంతో కష్టపడి పనిచేసేశారని గుర్తు చేసుకున్నారు. అధైర్య పడొద్దని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టిడిపి సీనియర్ నాయకులు గన్నిన మురళి, చదలవాడ ప్రసాద్, జామి సూరిచంద్రం, బుజ్జియ్య తదితరులున్నారు.

## తెలుగు యువత గోకవరం మండల అధ్యక్షునిగా సత్యనారాయణ

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు పల్లెల సత్యనారాయణ(బాబి)ను తెలుగు యువత మండల అధ్యక్షునిగా నియమించినట్టు జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన ఎంఎల్ఎ నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షులు నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి అధ్యక్షుడు పిల్లా చంటిబాబుతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# నేరాలు ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

గొల్లగూడెం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. విశాఖ పోర్ట్ నుంచి జిప్సం లోడుతో వరంగల్ వెళుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొంది. అదుపతప్పి కరెంటు స్తంభాల ఢీ కొట్టి చెరువులోకి దూసుకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తాడిపర్తి శివ నాగ ప్రసాద్(45) మృతి శరీరం నుంచి కాళ్లు చేతులు తల వేరుగా ఎగిరి పడ్డాయి. దేవరపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటన ప్రదేశాన్ని చేరుకొని పరిశీలించారు

## రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

### మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని బావాజీపేట గ్రామం పుష్కర కాలువ వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కామరాజు పేటకు చెందిన పండూరి రాంబాబు, అతని భార్య వీరలక్ష్మి, ఏడేళ్ల కుమార్తె షణ్ముఖి, నాలుగేళ్ల కుమారుడు తేజ బైకుపై గోకవరంవైపు ప్రయాణిస్తున్నారు. వారు బావాజీపేట పుష్కరకాలువ సమీపానికి చేరుకునే సరికి ఎదురుగా గ్యాస్ ట్యాంకర్ వీరి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పండురి షణ్ముఖి(7) మృతి చెందింది. కుమారుడు తేజ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. లారి ట్యాంకర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేశామని గోకవరం ఎస్ఐ తెలిపారు.

సీజ్ చేసిన బియ్యం వ్యాన్‌లతో డిఎస్ఒ, ఎంఎస్‌ఒలు

## 29 టన్నుల పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో పిడిఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. రెండు వేర్వేరు ప్రదేశాల్లో మూడు వ్యాన్లలో తరలిస్తుండగా పట్టుకుని సుమారు 29 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో జిల్లా పౌరసరఫరాల అధికారి సత్యనారాయణరాజు, ఏలేశ్వరం, ప్రత్తిపాడు సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్లు రవి, నాగబాబుతో కలిసి గురువారం తెల్లవారుజామున జాతీయ రహదారిలో మాటు వేశారు. ఈ నేపథ్యంలో రామవరం వైపు వెళ్తున్న రెండు వ్యాన్‌లను, జెవిఆర్ జంక్షన్ నుంచి వెళ్తున్న మరో వ్యాన్‌ను తనిఖీలు చేశారు. ఈ మూడు వ్యాన్‌లలో కలిపి 29 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించినట్లు సత్యనారాయణరాజు వెల్లడించారు. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మండల స్టాక్ పాయింట్‌కు తరలించామని, సంబంధిత బియ్యం యజమానులపై 6ఎ కేసును నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వ్యాన్‌లను సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

## కుటుంబీకులకు మహిళ అప్పగింత

ప్రజాశక్తి - గండేపల్లి

అదృశ్యమైన అవివాహితను గుర్తించి ఆమె కుటుంబీకులకు పోలీసులు గురువారం అప్పగించారు. మండలంలోని తాళ్లూరి గ్రామానికి చెందిన ఒక అవివాహిత ఈ నెల ఒకటో తేదీన అదృశ్యమైంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ శివనాగు, సిబ్బంది వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి ఆమె హైదరాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ ఏరియాలో ఉన్నట్లు గుర్తించారు. ఆమెను గురువారం గండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు.

## యువకునిపై బైండోవర్ కేసు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిసాల గ్రామానికి చెందిన ఐడి.ప్రసాద్ అనే యువకుడిపై గురువారం పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. జె.కొత్తూరు గ్రామానికి చెందిన అనామిక అనే ఆమెను వేధిస్తూ, మెసేజ్‌లు పంపుతున్న ప్రసాద్‌పై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రఘునాథరావు కేసు దర్యాప్తు చేసి అతన్ని అరెస్ట్ చేశారు. సత్ప్రవర్తన కోసం తహశీల్దార్ జెవిఆర్.రమేష్ వద్ద బౌండ్ ఓవర్ చేశారు. ఎవరైనా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు..

## డిపిఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లా పంచాయతీ అధికారి(డిపిఒ) శాంతమణి గురువారం సీతానగరం మండలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ఐవిఆర్ఎస్ కాల్స్‌కు సంబంధించి చెత్త సేకరణలో తక్కువ శాతం నమోదైన కారణంగా ఆమె సింగవరం గ్రామాన్ని సందర్శించారు. పరిశీలన జరిపారు. అనంతరం, ఆమె పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం, స్వర్ణ పంచాయితీ, స్వామిత్వ వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మూర్తి, మండల ప్రజా పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్నడిపిఒ శాంతమణి

వెలుగు కార్యాలయం వద్ద...

## తుప్పల్లో ప్రభుత్వ కార్యాలయాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర అంటూ నెలకో నినాదంతో అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు, క్షేత్రస్థాయిలో అమలుకు పొంతనే ఉండట్లేదు. మండలం అంతా పరిశుభ్రతా కార్యక్రమాలను నిర్వహిస్తున్న అధికారులు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల పరిసర ప్రాంతాలను విస్మరించినట్టు కనిపిస్తోంది. మండల కేంద్రం ఉండ్రాజవరంలో ఎక్కడ చూసినా కలుపు మొక్కలు, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. వాటిలో అధికంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూనే ఉన్నాయి. పోలీస్ స్టేషన్, వెలుగు కార్యాలయం, సచివాలయం 1, వెల్నెస్ సెంటర్, హౌసింగ్ ఎఇ, డిఇ కార్యాలయాలు పిచ్చిమొక్కల మధ్యలోనే నడుస్తున్నాయి. ఉండ్రాజవరం సచివాలయం-1 వద్ద మే నెలలో డ్రెయినేజీ నిర్మాణం కోసం గోతులు తవ్వి వదిలేశారు. వివిధ కార్యాకలాపాల కోసం సచివాలయానికి వచ్చే వృద్ధులు, వికలాంగులు దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వస్తే కార్యాలయానికి రావాలంటేనే భయపడే పరిస్థితి తలెత్తింది.

వెల్నెస్ సెంటర్ వెనుక పిచ్చి మొక్కలు

## పోలీస్ స్టేషన్‌లో ఎఆర్ డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

రాజమహేంద్రవరం ఎఆర్ డిఎస్‌పి డివిఆర్‌కె.కుమార్ గురువారం సీతానగరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ భవనం ప్రస్తుత పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ భవనం శిథిలావస్థలో ఉండటాన్ని గమనించారు. దీనిపై ఎస్ఐ రామ్‌కుమార్, సిఐ సత్యకిశోర్‌తో మాట్లాడారు. భవన మరమ్మత్తులు, కొత్త భవనం నిర్మాణంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

## మోర్త గ్రామంలో పొలం బడి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని మోర్త గ్రామంలో గురువారం ఎఇఒ బి.రాజారావు ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పొలం పరిసరాల విశ్లేషణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మిత్ర, శత్రు పురుగులు, నీటి వసతి, కలుపు సమస్య, రాబోవు చీడపీడలను గుర్తించడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. మిత్ర పురుగులను సంరక్షించుకునే బాధ్యత అందరి పైనా ఉందన్నారు. ఎక్కువ గాఢత కలిగిన పురుగు మందులను వాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది దీప్తి, రైతులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో రైతులు

## సాగు నీటి కోసం రైతుల దీక్షలు

ప్రజాశక్తి - రాజానగరం

కలవచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ మండలంలో సీతారాంపురం సెంటర్లో రైతులు గురువారం నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రభుత్వానికి స్థానిక ఎంఎల్ఎకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షల్లో పాల్గొన్న సర్పంచ్ బొబ్బర వరహాలు, ఉప సర్పంచ్ సురపురెడ్డి గోళ్లబ్బాయి, ఎంపిటిసి నాగమళ్ల పండుసూరపురెడ్డి, వైసిపి నాయకులు అడబాల చినబాబు అడబాల సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. కలవచర్ల లిఫ్ట్ ఇరిగేషన్‌లో మూడు మోటార్లకు ఒకటి మాత్రమే పని చేస్తుందన్నారు. దీని వల్ల శివారు భూములకు నీరందట్లేదన్నారు. ఫలితంగా పొలాలు బీటలు వారుతున్నాయన్నారు. వెంటనే మూడు మోటార్లను అందుబాటులోకి తెచ్చి సాగునీటిని సక్రమంగా అందించారు. వసిపి కేంద్ర కమిటీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మేడా గురుదత్ రైతుల దీక్ష శిబిరానికి వచ్చి సంఘీభావం ప్రకటించారు. దీనిలో తోరాటి శ్రీను తుమ్మల గంగరాజు కోలా అబ్బులు మందాల దత్తుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో అజ్జరం, వెంకటరామపురం, నడిపల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ వి.సరోజిని అధ్యక్షతన ఈ కార్యక్రమాలు జరిగాయి. తల్లిపాల విశిష్ట గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గారపాటి నాగసుధ, బీర సత్యవేణిరాజ్, అంగన్‌వాడీ టీచర్లు మంగాదేవి, సత్తార్ బేబీ, భవాని, ఎ.దుర్గ, పి.మీనా, జి.వెంకటలక్ష్మి, జి.మేరీకుమారి ఆయాలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మద్దిపాటి

## జగన్‌కు ఎప్పటికీ అధికారం రాదు : ఎంఎల్ఎ మద్దిపాటి

ప్రజాశక్తి - గోపాలపురం

జగన్‌కు ఎప్పటికీ అధికారం రాదని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. గురువారం మండలంలోని సుపరిపాలనతో తొలి అడుగు ముగింపు సభను నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు కొర్లపాటి శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన బహిరంగ సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మద్దిపాటి మాట్లాడారు. స్త్రీని అవమానించిన సమాజం, రాజ్యాలు కూలిపోతాయని చరిత్ర చెబుతుందన్నారు. ఆడవారిని అవమానించిన జగన్మోహన్ రెడ్డి ఎప్పటికీ రాజ్య అధికారంలోకి రాలేరన్నారు. ఇది రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పు అన్నారు. విద్యార్థులందరికీ తల్లికి వందనంను అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 1,02,200 ఇళ్లను సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

## చిక్కాలలో డిప్యూటీ ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చిక్కాల గ్రామంలో గురువారం శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రావణకుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడారు. స్వమిత్వ సర్వేను పరిశీలించి పలు సూచలను చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం నేపథ్యంలో పలు దుకాణాలను తనికీ చేశారు. కొంతమంది వర్తకుల నుంచి నిషేధిత పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులు, జ్యూట్ బ్యాగులు, వెజిటేరియన్ బ్యాగులు వినియోగించాలని తెలియజేశారు. ఎక్కడైనా నిషేధిత పాలిథిన్ కవర్లను వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని, అవసరమైతే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి. సంధ్యారాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు. దుర్గాప్రసాద్, విజయానందశాస్త్రి పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పారిశుధ్య నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణపై అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని అడిషినల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్ సూచించారు. గురువారం కుమారీ టాకీస్ రోడ్డు, త్యాగరాజ గాన సభ హాల్ రోడ్డులో పారిశుధ్య పనులను ఆయన తనికీ చేశారు. తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. కూలిన డ్రెయిన్లకు తక్షణమే మరమ్మతులను చేపట్టాలన్నారు. ఇంకా కొంతమంది తడి పొడి చెత్తను వేర్వేరుగా కాకుండా కలిపే ఇస్తున్నారని, దీనిపై పారిశుధ్య సిబ్బంది ప్రజలకు తగిన అవగాహన కల్పించాలన్నారు. తరచుగా వ్యర్థాలు వేసే ప్రదేశాలను ముందుగానే గుర్తించి ఆయా ప్రదేశాల్లో డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ప్రజారోగ్య అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## చెత్త సేకరణపై పర్యవేక్షణ అవసరం : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తడి, పొడి చెత్త సేకరణపై గ్రామా అధికారులు నిరంతరం పరిశీలించాలని కొవ్వూరు డివిజనల్ పంచాయతీ అధికారి ఎ.స్లావారెడ్డి సూచించారు. పారిశుధ్య పనుల నిర్వహణ పరిశీలనలో భాగంగా గురువారం మండలంలోని పాలంగిలో డిఎల్‌పిఒ పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద ఎత్తున సేకరిస్తున్న చెత్త నుంచి సంపద సృష్టించేందుకు కంపోస్ట్ ఎరువు తయారీకి మండల స్థాయి, గ్రామ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త ద్వారా తయారైన ఎరువును విక్రయించి, పంచాయతీకి ఆదాయాన్ని పెంచాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న స్వమిత్వ సర్వే పత్రాలను తనిఖీ చేసి, సర్వే త్వరితగతిన పూర్తి చేసేలా సిబ్బంది పని చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, మండల విస్తరణాధికారి కె.ఆంజనేయశర్మ, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డి.హసన్ జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ

## పిఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

పిఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కెవికె దుర్గారావు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సిఎం సూర్యఘర్ పథకానికి సంబంధించి ఆయన మాట్లాడారు. ఈ పథకంలో ఎస్‌సి, ఎస్‌టిలకు సోలార్‌రూఫ్‌ను ఉచితంగా పెట్టుకోవచ్చన్నారు. 2కెవి విద్యుత్ సోలార్ మొత్తం కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుందన్నారు. అలాగే నెలకి రూ.200 చొప్పున అద్దె కూడా చెల్లిస్తుందన్నారు.

## లైసెన్స్ లేని తుపాకులు కలిగి ఉండడం నేరం : ఎస్‌పి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నాటు తుపాకులు, లైసెన్సు లేని తుపాకులు, ఇతర మారణాయుధాలను కలిగి ఉండటం నేరమని ఎస్‌పి నరసింహకిశోర్ తెలిపారు.. అటువంటి వారిని గుర్తిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరి వద్దనైనా నాటు తుపాకులు, లైసెన్స్ లేని తుపాకులు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో అప్పగించాలన్నారు. అనుమానిత ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి జల్లెడ పట్టాలని, జిల్లాలో అక్రమ మారణాయుధాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు.

## రోడ్లపై వర్షపు నీటితో అవస్థలు

ప్రజాశక్తి - గోపాలపురం

రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి మార్కెట్ వద్ద ఆర్ అండ్ బి రోడ్డుపై 100 మీటర్ల మేర నీరు నిలిచిపోయింది. మోకాళ్ల ఎత్తు నీటిలో ప్రయాణించలేక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం కురిస్తే నీరు నిలిచిపోతుందని స్థానికులు తెలిపారు. రోడ్లపై ఆక్రమణలు కూడా నీరు నిలిచిపోవడానికి కారణమని వారంటున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి డ్రెయినేజీలను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు చాగల్లు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు చాగల్లు జడ్‌పిహెచ్ఎస్ విద్యార్థి బాలానంద కిశోర్ ఎంపికయ్యాడని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 3న రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికల్లో బాలానందకిశోర్ విశేషంగా రాణించాడని తెలిపారు. ఈనెల 8. 9. 10 తేదీల్లో చీరాల్లో జరిగే పోటీలో కిశోర్ పాల్గొంటాడని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కిశోర్‌ను హెచ్‌ఎం వాసవి, ఎస్‌ఎంసి చైర్మన్ గోపాలకృష్ణ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

**నేటి నుంచి రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలు**

చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8, 9 తేదీల్లో రాష్ట్ర స్థాయి జూనియర్ టార్గెట్ బాల్ పోటీలు జరుగుతాయని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. ఈ పోటీలు రెండు రోజులు పాటు జరగనున్నాయని తెలిపారు. 13 జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతున్నారన్నారు.

## సీతబాబు కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

సీతబాబు కుటుంబాన్ని గురువారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. గోకవరం ఇటీవల మరణించిన దాసరి సీతారామయ్య (సీత బాబు) పెద్దకార్యానికి వైసిపి జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోట నరసింహం, తోట వాణి దంపతులు, మాజీ ఎంఎల్ఎలు రౌతు సూర్యప్రకాశరావు, జ్యోతుల చంటిబాబు, జక్కంపూడి గణేష్, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ హాజరయ్యారు. సీతాబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దాసరి సీతాబాబు సోదరులు దాసరి చినబాబుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, గోకవరం మండలం నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## కడియం మసీదు కమిటీకి ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి-కడియం

కడియం మసీదు ఏ కౌసర్ కమిటీకి సత్వరం ఎన్నికలు నిర్వహించాలని, మసీదు కమిటీ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ సలీం, సర్కార్ భాషా కోరారు. గురువారం స్థానిక మసీదులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తమ ప్యానెల్ పదవీకాలం ముగియడంతో మసీదు అభివృద్ధి, సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కాకినాడ వక్ఫ్ బోర్డుకు పదవీ కాలాన్ని పెంచమని గతంలో కోరామన్నారు. అనంతరం ఎన్నికలు కూడా నిర్వహించాలని మరోమారు తెలియజేశామన్నారు. స్థానిక టిడిపి నాయకులు రాష్ట్ర స్థాయిలో పైరవీలు చేసి నామినేటెడ్ కమిటీని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. తక్షణం ఎన్నికలు జరిపి మెజారిటీ సభ్యుల ఆమోదాన్ని పొందాలని, తాము పోటీకి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ధైర్యం ఉంటే దొడ్డి దారిన సత్తాలేని కమిటీని ప్రకటించడాన్ని విరమించుకుని పోటీకి సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో పోటీ చేసి తమపై విజయం సాధిస్తే సంపూర్ణంగా సహకరిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో షేక్ గౌస్, షేక్ బాజ్జి, షేక్ యాకూబ్, షేక్ బాషా, షేక్ ఖాదర్, షేక్ మీరా సాహెబ్, షేక్ లోహన్, షేక్ నజీర్, షేక్ అమీర్ షా, షేక్ అక్బర్, షేక్ రఫీ, మహమ్మద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## నల్లజర్ల పిహెచ్‌సిలో అమెరికా అమ్మాయి

**నల్లజర్ల :** నల్లజర్ల పిహెచ్‌సిని అమెరికాకు చెందిన యువతి అభిగేల్ గురువారం సందర్శించారు. గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న సేవలను ప్రశంసించారు. ఇండియాలో పర్యటిస్తున్న ఆమె పలు ప్రదేశాలను సందర్శిస్తూ గురువారం నల్లజర్ల ప్రభుత్వాసుపత్రికి విచ్చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావును కలిసి ఇన్సులిన్ సిరంజిల బాక్స్‌ను అందించారు. అమెరికా అమ్మాయి తమ ఆసుపత్రికి రావడం పట్ల వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఆమె వెంట చోడవరం మధు, మల్లిపూడి రాజారావు, దానియేలు, తాడిగడప సిద్ధు తదితరులున్నారు.

మహారాజశ్రీ 5 వ అదనపు జూనియర్ వారి కోర్టు: కాకినాడ
**E.P.No.60/2023; O.S.No.835/2022**
Between:
చిట్టూరి రవీంద్ర ...డిక్రీహోల్డర్
మరియు
మనుగుల నరసింహారావు ..జడ్జిమెంట్ డెట్టార్
**DHr వేయించిన వేలం ప్రకటన**
శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారము ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని పై కోర్టు వారి యెదుట **ది.22-08-2025వ తేదిన ఉదయం గం.10.30 ని॥ల** లగాయితు కోర్టు ఇస్తియార్ల ప్రకారము వేలం వేయబడును. ఆసక్తి కలవారు వచ్చి పాడుకోవచ్చును. వివరములకు కోర్టు నాజరు గారి ఆఫీసులో గానీ, DHR అడ్వకేట్ గారి ఆఫీసులో గాని తెలుసుకోవచ్చును.
**షెడ్యూల్:** పూర్వపు తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతము కాకినాడ జిల్లా, సర్పవరం సబ్‌రిజిష్ట్రరీ పరిధిలో చేరిన కాకినాడ రూరల్ మండలం, సర్పవరం గ్రామ పంచాయితీ, సర్పవరం గ్రామములో పాత డోర్.నెం.3-70 మరియు క్రొత్త డోర్.నెం.3-143 లో గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు లో ఆర్.సి.సి. ఇల్లు మరియు ఖాళీ స్థలము చ॥150గ॥లకు హద్దులు: **తూర్పు:** 62' 9" కోన శ్రీరాములు గారి ఇల్లు మరియు స్థలం. **దక్షిణం:** 21' 6" పంచాయితీ రోడ్. **పడమర:** 62' 9" మద్దాల వెంకటరావు గారి ఇల్లు మరియు స్థలం. **ఉత్తరం:** 21' 6" ఈ డోర్ నెంబర్‌లో వున్న మిగతా ఆస్థి. పైన తెలిపిన ఆస్థి యావత్తు ఈజిమెంటరీ హక్కులతో సహా.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
DHr Value : Rs. 14,00,000/-
Amina Value : Rs. 40,00,000/-
JDr Value : Not Given
**కాకర వెంకటేశ్వరరావు,** అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) అమలాపురం వారి కోర్టులో
**I.P.No.14/2022**
**Between:-**
1) Alanka Gowri Maheswara Rao, S/o Pothuraju, Hindu, Age 65,D.No. 9-1-25/9/109, N.T.R.Marg, Amalapuram, D.B.R.A. Konaseema Dist ...Petitioner
And
Konathala Venkata Murali and Others ...Respondents
2) Boddada Padma Krishna, S/o Not Known, Hindu, Age 49, Business, D. No. 12-4-85/2, Near Vivekananda Hospital, Opp. Yamani Hospital, Anakapalli (P.o), Vizag District.
8) Arjilli Das, S/o. Nuka Raju, Hindu, Age 43, Business, D.No. 14-21-78, RH Colony, Gangavaram, Bala Cheruvu Road, Peda Gantyada, Gajuvaka, Vizag District.
20) Banna Rama, W/o Not Known, Hindu, Age 43, House Wife, D.No.3-45/2, Muchavani Peta, Fazulbag Peta, Srikakulam, Srikakulam District.
పై నెంబర్ ఐ.పి.14/2022 పిటీషనర్ తననను Insolvent గా డిక్లేర్ చేయమని దాఖలు చేసిన పిటీషన్‌లో 2,8 మరియు 20 రెస్పాండెంట్లుకు నోటీసులు పేపర్ ప్రకటన ద్వారా అమలుకు గాను ది.26-08-2025వ తేదీన వాయిదా అయి ఉన్నది. గనుక 2,8 మరియు 20 రెస్పాండెంట్లుకు వాయిదాకు ఉదయం 10.30 గంటలకు అమలాపురం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియెడల 2,8 మరియు 20 రెస్పాండెంట్లు పరోక్షమున తీర్మానింపబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
**V.R.Vidya sankaram**
Advocate
Amalapuram Amalapuram
05-08-2025 Cell. 9849293793

IN THE COURT OF THE IV ADDITIONAL JUDICIAL FIRST CLASS MAGISTRATE: KAKINADA
**FDP No.3 of 2024**
**in O.S.No.692/2019**
Between :
**Smt. UNGARALA KUMARI,**
W/o.Kasi Eswara Rao, Age 40 years, D.No.52-9-5, Chikkalavari Street, Jagannadhapuram, Kakinada.
...Petitioner/Plaintiff
and
**R1) Pasupuleti Maha Lakshmi,**
W/o. Late Pasupuleti Babji, Age 40 years, D.No.58-1-49, Chinna Market Veedhi, J.Ramaraopeta, Kakinada.
**R2) Pasupuleti Nagendra,**
S/o. Late Pasupuleti Babji, Age 20 years, D.No.58-1-49, Chinna Market Veedhi, J.Ramaraopeta, Kakinada.
...Respondents/Defendants
పై నంబర్ FDP No.3 of 2024 in O.S.No.692/2019 లో కోర్టు వారి ఆర్డర్ ప్రకారము R2/2వ ప్రతివాది అయిన Pasupuleti Nagendra గారికి చాలా పర్యాయములు నోటీసులు పంపినప్పటికీ వారు అందుకొనక పోవుట వలన, మీకు ఈ పేపరు ద్వారా పై కేసు ది.21-08-2025 తేదీన వాయిదా ఉన్నదని తెలియపరచడమైనది. కావున మీరు అనగా R2/2వ ప్రతివాది **ది.21-08-2025న, ఉదయం 10.30 నిమిషములకు** మీరు స్వయంగా గాని లేదా మీ ప్లీడర్ గారి ద్వారా గాని కోర్ట్ లో హాజరై పై కేసులో ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపరచుకోవలెను, లేని యెడల మీ పరోక్షముందు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.
**వక్కలంక సత్యనారాయణమూర్తి**
**M(T).రాజశ్రీ, T.S. రత్నాకర్, అడ్వకేట్స్,**
కాకినాడ. డో.నెం. 7-9-29, సాంబమూర్తి వీధి,
ది.07-8-2025 రామారావుపేట, కాకినాడ. సెల్: 9849012112

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
**E.A.No.143/2025 E.P.No.33/2023**
**in O.S.No.750/2011**
**Between:-**
Gangisetti Vijaya Veera Venkata Surya Satyanarayana@Chantibabu
...Petitioner/DHR
And
Eeda@veedhi Kanaka Durga Prasad(died) and Others ...JDRs
JDR2. Veedhi Visalakshi, W/o.Late Kanaka Durga Prasad, Hindu, aged 54 years, House Wife, D.No.23-18-167, 3 street, Lalithanagar, Ward No. 12, Rajahmundry.
JDR3. Veedhi Sudhakar, S/o. Late Kanaka Durga Prasad, Hindu, aged 34 years, D.No.23-18-167, 3 street, Lalithanagar, Ward No. 12, Rajahmundry.
JDR4. Veedhi Jitendra, S/o. Late Kanaka Durga Prasad, Hindu, aged 32 years, D.No.23-18-167, 3d street, Lalithanagar, Ward No.12, Rajahmundry.
పై నంబరు పిటిషన్‌లో 2,3,4,JDRs అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్య పూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.13-08-2025** సం॥రం తేది ఉదయం **10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
**బి.శ్రీనివాస్**
రాజమండ్రి అడ్వకేట్,రాజమండ్రి
05-08-2025 సెల్.9701332960

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
**E.P.No.51/2016, O.S.No.68/2014**
**Between:-**
శ్రీ నాళం వారి సత్రం, రాజమహేంద్రవరం
Rep by its Executive Officer ...DHr
And
వాసంశెట్టి శేషగిరి రావు, S/o. నాగభూషణం, డోర్.నెం.5-33, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా.
**వేలం ప్రకటన**
పై నెంబరు డిక్రి ప్రకారం DHr/ వాదికి ఇందలి JDR/ ప్రతివాది వలన రావలసిన డిక్రి బాకీ వసూలు నిమిత్తం, ఇందలి JDR స్వాధీన హక్కు భుక్తములలో గల ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి ఎదుట **ది.25-08-2025** తేదీన **ఉ.10.30** లగాయితు వేలం వేయబడును. కావున పాటదారులు 1/4వంతు ధరావతు సొమ్ముతో హాజరు అయ్యి వేలం పాడుకొనవచ్చును. ఇంకనూ అవసరమయిన సమాచారము కొరకు DHr అడ్వకేట్ గార్ని కాని శ్రీ కోర్టు వారి ఆఫీసులో కాని తెలుసుకొనవచ్చును.
**వేలం ఆస్థి వివరం**
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా, ఉప్పలగుప్తం మండలం, అమలాపురం సబ్ రిజిస్ట్రీలో చేరిన భీమనపల్లి పంచాయితీ భీమనపల్లి గ్రామం జిరాయితి పల్లం R.S.No.54/1, AC1-02 Cents in AC 3-06Cents హద్దులు.
**తూర్పు:-** శిరంగు సత్తియ్య భూమి, **దక్షిణం:-**దేశంశెట్టి వారి భూమి, **పడమర:-** పంటకాలువ, **ఉత్తరం:-** గంజి వారి భూమి.సర్వ ఈజిమెంట్ హక్కులతో సహా
DHr.Value. Rs.1,00,000/-
Amin Value. Rs.16,00,000
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
**కళా వెంకట్రావు**
DHr.తరపు అడ్వకేట్
భూపయ్య అగ్రహారం
అమలాపురం, సెల్. 9440147955

**పెద్దాపురం పురపాలక సంఘం**
**ఇంజినీరింగ్ విభాగం**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు**
**ఆర్.ఒ.సి. నెం. 745/2024-E1** **తేది.07-08-2025**
పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో సాధారణ నిధులతో మ్యాన్ మజ్దూర్‌తో 3 నెలలకు స్పెషల్ సానిటేషన్ మెయింటెనెన్స్ చేయు పనికి ECV మొత్తం రూ. 10,54,560/-లతో 2వ పిలుపు ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు ద్వారా టెండర్లు కోరడమైనది.
**డాక్యుమెంట్ లభ్యత (ఆన్ లైన్) : ది.08-08-2025 తేదీ ఉదయం 11.00 గం॥ల నుండి**
**బిడ్ దాఖలు ముగింపు తేదీ : ది.14-08-2025 తేదీ సాయంత్రం 5.00 గం॥ల వరకు**
ఇతర వివరములు : www.tender.apeprocurement.gov.in
Phone Nos. 9849905811, 9849907062
సం/- **కమిషనరు**
పెద్దాపురం పురపాలక సంఘం